క్లుప్తంగా

జగనన్న భూసర్వేతో వివాదాలకు తెర



వల్లూరులో డ్రోన్ సర్వేను ప్రారంభిస్తున్న తహసీల్దార్ లక్ష్మి

గణపవరం: జగనన్న భూసర్వే వల్ల భూతగాదాలకు తెరపడుతుందని గణపవరం తహసీల్దార్ పమ్మిలక్ష్మి అన్నారు. బుధవారం గణపవరం మండలం వల్లూరులో ఆమె డ్రోన్ సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 12 గ్రామాల్లో భూసర్వే పూర్తి చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ ముచ్చర్ల వేణు, సిబ్బంది పాల్గొన్నారు.

పురుగుమందు ప్రభావానికి వ్యక్తి మృతి

పెదవేగి : పొలంలో పురుగు మందు పిచికారీ చేస్తుండగా అస్వస్థతకు గురైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పెదవేగి ఎస్సై ఎం.లక్ష్మణ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాట్నాలకుంటకు చెందిన పరిమి వెంకటరమణ అదే గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో పురుగుమందు పిచికారీ చేయడానికి మంగళవారం కూలి పనికి వెళ్లాడు. పిచికారీ అనంతరం అతను తీవ్ర అస్వస్థతకు గురవ్వడంతో ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున వెంకటరమణ (30) మృతిచెందాడు. మృతునికి భార్య నాగమణి, బాబు, పాప ఉన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

జూదరుల అరెస్టు

పెదవేగి మండలం గార్లమడుగులో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.4,200 నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్సై ఎం. లక్ష్మణ్ తెలిపారు.

బాలల హక్కలను పరిరక్షించాలి

పెదవేగి : బాలల హక్కలను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ఆరు నుంచి 14 ఏళ్లలోపు బాల బాలికలను బడిలో చేర్పించే విధంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డిస్ట్రిక్ చైల్డ్ ప్రొటెక్షన్ అధికారిణి సూర్యచక్రవేణి అన్నారు. పెదవేగి మండలం వంగూరులోని గ్రామ సచివాలయంలో చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ క్రాఫ్ట్ ఆధ్వర్యంలో బాలల హక్కులు, ఉద్భవిస్తున్న సమస్యలపై 50 మంది సభ్యులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌గా పాల్గొన్న జిల్లా బాలల సంరక్షణ అధికారి డాక్టర్ సీహెచ్ సూర్య చక్రవేణి మాట్లాడుతూ గ్రామంలోని 18 ఏళ్ల లోపు బాల బాలికల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి అధికారులకు సమాచారం అందించాలని వివరించారు. సర్పంచ్ చీలి రూతు మాట్లాడుతూ బాలలకు అనేక అంశాలపై రక్షణ సంరక్షణ కల్పిస్తూ అవగాహన కార్యక్రమాలు సదస్సులు నిర్వహించడం అభినందనీయమన్నారు. పంచాయతీ కార్యదర్శి కె స్వరాజ్యలక్ష్మి, మహిళా సంరక్షణ కార్యదర్శి పి యుగలి, క్రాఫ్ట్ జిల్లా కోఆర్డినేటర్ ఎస్ రవిబాబు డి సి పి యు పి ఓ ఆర్ రాజేష్,చైల్డ్ హెల్ప్ లైన్ 1098 రాజు , ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, మహిళలు పాల్గొన్నారు.

దేశం గర్వించదగ్గ గొప్ప వ్యక్తి బీఆర్ అంబేద్కర్

భీమడోలు: దేశం గర్వించ దగ్గ గొప్ప వ్యక్తి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. విజయవాడలో ఈనెల 19న బీఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణలో భాగంగా ఆగడాలలంక సచివాలయం వద్ద నిర్వహించిన జన భాగిధారి కార్యక్రమాన్ని పురస్కరించుకుని బుధవారం బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అంబేద్కర్ బాటలో మనమంతా నడవాలంటూ ప్రజలతో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. విజయవాడలో చేపట్టిన సామాజిక న్యాయ విగ్రహానికి మద్దతుగా ఆయన తొలి సంతకం చేసారు. దీనితో ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో సంతకాలు చేసి తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు. అనంతరం వాసుబాబు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయం లక్ష్యంతో సుపరిపాలనను అందిస్తున్నారని అన్నారు. విజయవాడలోని స్వరాజ్ మైదాన్‌లో ఈనెల 19న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా 19 ఎకరాల్లో రూ.404 కోట్లతో నిర్మించిన 125 అడుగుల ఎత్తు గల భారీ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి జాతికి అంకితం చేస్తారన్నారు. సామాజిక న్యాయానికి ప్రతి రూపంగా ఈ విగ్రహాన్ని నిర్మించారన్నారు. అంబేద్కర్ స్మృతి వనాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారన్నారు. రాష్ట్రంలోని దళిత సోదరులంతా జగనన్నకు తమ పూర్తి మద్దతు అందించి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఘన విజయం అందించాలని కోరారు. తొలుత గ్రామంలోని దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి, బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కన మాల రామయ్య, సర్పంచ్ భలే రాంబాబు, పార్టీ మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, మండల యూత్ అధ్యక్షుడు మద్దుల రాజా, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ భలే నాగలక్ష్మి, నాయకులు సైదు గోపాలకృష్ణ, చిగురుపాటి యోహోషువ, పాము వెంకటేశ్వరరావు, గ్రామ కార్యదర్శి మురళీ, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.



ఆగడాలలంకలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు



గుండుగొలనులో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న సర్పంచ్ కూర్మా లక్ష్మీ, ఉప సర్పంచ్ ఎం.సూర్యనారాయణ రాజు

అంబేద్కర్ స్ఫూర్తితో జగనన్న పాలన

భీమడోలు: భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆలోచనా విధానం స్ఫూర్తిదాయకమని గుండుగొలను ఉపసర్పంచ్, గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ముదుండి సూర్యనారాయణరాజు అన్నారు. గుండుగొలనులో బుధవారం జన భాగిదారి కార్యక్రమంలో బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సర్పంచ్ అధ్యక్షత వహించారు. తొలుత రాజ్యాంగ ప్రవేశికపై ప్రతిజ్ఞ చేసారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు గొటికల మురళీ, నల్ల శంకర్, నాయకులు నత్తా నరసింహులు, కాలి రాజ్‌కుమార్, సామాజిక కార్యదర్శి టి.సుమన్‌బాబు, వీఆర్వో కె.శంకర్, సచివాలయ ఉద్యోగులు, మొగళ్ల పాండు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సామాజిక సాధికారత

గణపవరం: డాక్టర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలన సాగిస్తున్నారని మండల సర్పంచ్‌ల చాంబర్ చైర్మన్ చనుమూరి లక్ష్మీదుర్గ అన్నారు. ఈనెల 19న విజయవాడ స్వరాజ్ మైదానంలో ప్రతిష్టాత్మకంగా 125 అడుగుల అంబేద్కర్ విగ్రహావిష్కరణను పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో సామాజిక సమత సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజా ప్రతినిధులు, సచివాలయాల సిబ్బంది అంబేద్కర్ ఫ్లెక్సీలపై సంతకాలు చేశారు. పలు గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహాల వద్ద నేతలు మహా సంకల్ప ప్రతిజ్ఞలు చేశారు.

అభయాంజనేయస్వామిని దర్శించుకున్న కేంద్ర మంత్రి



అప్పనవీడు అభయాంజనేయస్వామి సన్నిధిలో కేంద్రమంత్రి శ్రీపాద యశోనాయక్

పెదపాడు: మండలంలోని అప్పనవీడు అభయాంజనేయస్వామిని దర్శించుకున్న కేంద్ర పర్యాటక శాఖ మంత్రి శ్రీపాద యశోనాయక్ మంగళవారం దర్శించుకున్నారు. రాష్ట్ర పర్యటనకు వచ్చిన యశోనాయక్‌కు బీజేపీ జిల్లా కార్యదర్శి శింగవరపు సత్యభాస్కర గణేష్‌బాబు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అర్చకులు ఆలయ సంప్రదాయం ప్రకారం పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం కేంద్రమంత్రి స్వామివారికి తమలపాకులతో పూజలు చేశారు. అనంతర స్వామి వారి శేష వస్త్రాన్ని ఆయనకు బహూకరించి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గుత్తికొండ రాజాబాబు, చిరువోలు బుచ్చిబాబు, ఉన్నమట్ల కబర్థి ఎస్ శేషుకుమార్ తోట మురళీధర్, జింకా నలగామరాజు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్ర' ఆటల పోటీలు



ఉంగుటూరు: క్రికెట్ క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న తహసీల్దారు, డీఎల్‌డీవో



దెందులూరు: ఆటల పోటీలు ప్రారంభిస్తున్న ప్రత్యేకాధికారి కృపావరం, ఎంపీడీఓ భీమరాజు



పెదవేగి గురుకులంలో క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న డిప్యూటీ కలెక్టర్, ఎంపీపీలు

ఉంగుటూరు: ఆడుదాం ఆంధ్ర ఆటలు పోటీలు ఉత్సాహంగా ఉల్లాసంగా కొనసాగుతున్నాయి. మండలంలోని 26 సచివాలయాల్లో జట్లు ఈ క్రీడాపోటీల్లో పాల్గొన్నాయి. మండలంలో 92 జట్లు పాల్గొంటే 46 జట్లు విజయం సాధించాయి. పురుషులు క్రికెట్టులో కై కరం 2 -ఎ.గోకవరం జట్టు తలపడగా ఎ.గోకవరం జట్టు విజయం సాధించింది. యర్రమిల్లిపాడు-చేబ్రోలు 2 సచివాలయాల జట్లు తలపడగా చేబ్రోలు 2 జట్టు విజయం సాధించింది. వాలీబాల్ బాలురు ఉంగుటూరు 2 -బాదంపూడి తలపడగా ఉంగుటూరు 2 విజయం సాధించింది. మహిళలు కబడ్డీ విభాగంలో బొమ్మిడి-ఎ.గోకవరం తలపడగా బొమ్మిడి జట్టు విజయం సాధించింది. ఉంగుటూరు-గొల్లగూడెం తలపడగా ఉంగుటూరు జట్టు విజయం సాధించింది. పురుషులు బ్యాడ్మింటన్‌లో చేబ్రోలు-1, నాచుగుంట తలపడగా చేబ్రోలు- 1 విజయం సాధించింది. కైకరం-2, నారాయణపురం- 2 తలపడగా కై కరం-2 విజయం సాధించింది. మహిళలు ఖోఖోలో తల్లాపురం -బొమ్మిడి తలపడగా బొమ్మిడి విజయం సాధించింది. కై కరం-1, బాదంపూడి తలపడగా కై కరం-1 విజయం సాధించింది.

ఈపోటీలు ఖోఖో, క్రికెట్టు పోటీలు కైకరం జిల్లా పరిషత్తు హైస్కూలు గ్రౌండ్‌లో నారాయణపురం జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో క్రికెట్టు బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు ఉంగుటూరు జెడ్పీ హైస్కూలు గ్రౌండ్‌లో నిర్వహించారు. బాదంపూడి హైస్కూలు గ్రౌండ్‌లో కబడ్డీ, క్రికెట్టు పోటీలు నిర్వహించారు. ఎంపీడీవో ప్రేమాన్విత, ఎంఈవో- 2 శ్రీనివాసరావు పర్యవేక్షించారు. తహసీల్దారు వెంకటరమణ, మండల ప్రత్యేక అధికారి వెంకటలక్ష్మి పాల్గొన్నారు. పీడీలు ఈ పోటీలను నిర్వహించారు.

మండల స్థాయి ఆటల పోటీలు ప్రారంభం

దెందులూరు: గ్రామ శివారు పట్టణ ప్రాంతాల్లో ఉన్న యువతలో నైపుణ్యం వెలికితీసి వారిని రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే ఆడుదాం ఆంధ్ర లక్ష్యమని ప్రత్యేకాధికారి ఎస్.కృపావరం, ఎంపీడీఓ భీమరాజు అన్నారు. బుధవారం దెందులూరు గారపాటి హైమావతిదేవి ఉన్నత పాఠశాలలో మండల కన్వీనర్ జక్కుల సురేష్‌కుమార్, మండలంలోని ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు సెట్‌వెల్ ఆధ్వర్యంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ భీమరాజు మాట్లాడుతూ ఐదు రోజులు పాటు ఆడుదాం ఆంధ్ర పోటీలు నిర్వహిస్తామన్నారు. వాలీబాల్, కబడ్డీ, క్రికెట్, ఖోఖో, ఇతర పోటీలు నిర్వహించారు.

క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరచాలి

పెదవేగి : ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా నేటి నుంచి మండల స్థాయిలో నిర్వహించనున్న క్రీడా పోటీల్లో క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని, పెదవేగి మండల ప్రత్యేక అధికారి, డిప్యూటీ కలెక్టర్ జీవీవీ సత్యనారాయణ అన్నారు. బుధవారం ఆడుదాం ఆంధ్రలో భాగంగా మండల స్థాయి పోటీలను ఎంపీపీ తాతా రమ్యతో కలిసి ఆయన ప్రారంభించారు. ఆరు రోజులు పాటు నిర్వహించనున్న ఈ పోటీల్లో ప్రతి క్రీడాకారుడు ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. ఈ క్రీడా పోటీలు పెదవేగిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జీ ఆర్ మనోజ్, వివిధ పాఠశాలల నుంచి వచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

దెందులూరు: వివిధ పనుల కోసం వచ్చిన వారి ప్రతి అర్జీని అన్నిశాఖల అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి సకాలంలో వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. బుధవారం దెందులూరు ఎమ్మెల్యే కార్యాలయంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రాధాన్యతా క్రమంలో సమస్యలన్నీ పరిష్కరిస్తామని ఆయన అన్నారు. దెందులూరు ఏఎంసీ వైస్ చైర్మన్ కాటి సుధాకర్, వైస్ ఎంపీపీ గొల్ల నాగరాజు, నాయకులు నాగభూషణం, మురళీ తదితరులతో మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి తన పూర్తి సహాయసహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే కొఠారు అన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

దెందులూరు: వివిధ రకాల వల్ల వైద్యశాలలో చికిత్స పొందుతున్న ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆకాంక్షించారు. బుధవారం ఏలూరులోని నళిని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కూచింపూడి గ్రామానికి చెందిన ముత్యాలరాజు కుమార్తె రాణిని పరామర్శించి ఆరోగ్యం, వైద్యసేవల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏలూరు సిరి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాయన్నపాలెంకు చెందిన కొఠారు రాజశేఖర్ (నాని)ని పరామర్శించారు. త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు. పెదవేగి మండలం రాట్నాలకుంటకు చెందిన పరిమి వెంకటరమణ మృతి చెందడంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి వెళ్లి వారి భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. వెంకటరమణ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



ఏలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాణిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

కొల్లేరు వాసుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

భీమడోలు: కొల్లేరు వాసుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. కొల్లేరు గ్రామం ఆగడాలలంకలో బుధవారంలో గడపగడపకు మన ప్రభుత్వం, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.32 లక్షలతో నిర్మించిన నాలుగు సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. తొలుత ఆయనకు గ్రామస్తులు, మహిళలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సర్పంచ్ భలే రాంబాబు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వాసుబాబు మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో దళిత, బీసీ వాడల్లో పర్యటించినప్పుడు అక్కడి ప్రజలు కోరిన విధంగా రూ.20 లక్షలతో మూడు సీసీ రోడ్లను నిర్మించామన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు రూ.12లక్షలతో సిమెంట్ రోడ్లను నిర్మించామన్నారు. కొల్లేరు వాసులకు స్వచ్ఛమైన మంచినీటిని అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జల్ జీవన్ మిషన్‌లో రూ.కోట్లు మంజూరు చేశారన్నారు. ఆగడాలలంక నుంచి చెట్టున్నపాడు వరకు రోడ్డును అభివృద్ధి చేశామని, చెట్టున్నపాడు -మల్లవరం రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయన్నారు. ఎంపీపీ కనమాల రామయ్య, పార్టీ మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, మండల యూత్ అధ్యక్షుడు మద్దుల రాజా, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ భలే నాగలక్ష్మీ, గ్రామ కార్య దర్శి మురళీ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



ఆగడాలలంకలో సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

యువతను ప్రోత్సహించేందుకే 'ఆడుదాం ఆంధ్ర'

భీమడోలు: రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని, యువ క్రీడాకారుల్లో దాగి ఉన్న క్రీడా స్ఫూర్తిని చాటేందుకు దోహదపడుతుందని ఏలూరు ఆర్డీవో ఎన్ఎస్‌కే ఖాజావల్లి అన్నారు. భీమడోలు ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ఆయన బుధవారం ప్రారంభించారు. కొద్ది సేపు ఆర్డీవో బ్యాట్ పట్టుకుని పరుగులు తీసి క్రీడాకారులు ఉత్సాహపర్చారు. సచివాలయాల స్థాయి నుంచి మండల స్థాయికి ఎంపికైన 22 క్రికెట్ టీములకు పోటీలను నిర్వహించారు. తొలి మ్యాచ్ దుద్దేపూడి, పోలసానిపల్లి టీములకు తలపడ్డాయి. క్రీడాకారులను ఆర్డీవో ఎన్ఎస్‌కే ఖాజావల్లి, ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి పరిచయం చేసుకున్నారు. ఆర్డీవో మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ వరకు మండల స్థాయిలో పోటీలు, ఈనెల 24 నుంచి నియోజకవర్గ స్థాయిలో పోటీలు నిర్వహిస్తామని విజేతలకు నగదు ప్రోత్సాహకాలను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు సంక్రాంతి పండుగ నేపథ్యంలో పోటీలు జరగబోవన్నారు. ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 17 పురుష క్రికెట్ జట్లు, 5 మహిళా జట్లు పాల్గొంటున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఈదుపల్లి శ్రీనివాసరావు, డీటీ షంషూద్దీన్,ఏఎస్సై వెంకటేశ్వరరావు, గ్రామకార్యదర్శులు ముత్తయ్య, సూర్యకుమార్, వెంకట్రావు, వీఆర్వోలు వెజ్జు వినయ్, సాల్మన్‌రాజు, పీడీలు, స్పోర్ట్స్ వలంటీర్లు పాల్గొన్నారు.



భీమడోలులో క్రికెట్ పోటీల్లో బ్యాట్ పట్టిన ఏలూరు ఆర్డీవో ఎన్ఎస్‌కే ఖాజావలి

ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీలు

పెదపాడు: ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు ప్రశంసాపత్రాలు అందించనున్నట్లు పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి తెలిపారు. పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి ఆడుదాం ఆంధ్ర పోటీలను ప్రారంభించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన క్రీడాకారులు అధికారులు నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం పోటీల్లో పాల్గొనాలని తెలిపారు. విజేతలకు నగదు బహుమతులు అందించనున్నట్లు చెప్పారు. పెదపాడు ఎంపీడీవో సబ్బితి నర్సింహమూర్తి, ఎంఈఓ డీవీ రమణ, బత్తుల ఏసురాజు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్ర పర్యటనలతో జ్ఞాన సముపార్జన

గణపవరం: క్షేత్రస్థాయి పర్యటన వల్ల విద్యార్థులు వాస్తవ పరిస్థితులు అంచనా వేయగలుగుతారని, తద్వారా జ్ఞానాన్ని పొందుతారని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి అన్నారు. బుధవారం గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి చెందిన ఫిజికల్ సైన్సు విద్యార్థుల క్షేత్ర పర్యటనను ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షేత్ర పర్యటన వల్ల విద్యార్థులకు సైద్ధాంతిక పరిజ్ఞానంతో పాటు ప్రాక్టికల్ నాలెడ్జ్ పెరుగుతుందన్నారు. క్షేత్ర పర్యటనలో భాగంగా విద్యార్థులు ఉంగుటూరు మండలం గొల్లగూడెంలోని సోలార్ విద్యుత్ ప్లాంట్ సందర్శనకు బయలుదేరి వెళ్లారు. అక్కడ సోలార్ ప్లాంట్ సైట్ ఇంజనీర్ కె.గంగాచారి, సైట్ ఇంజనీర్ గోపి, టెక్నీషియన్ సీహెచ్‌రాజు విద్యార్థులకు సోలార్ విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, వినియోగం తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో భౌతికశాస్త్రం అధ్యాపకులు గణేష్‌కుమార్, రసాయనశాస్త్రం, గణిత అధ్యాపకులు ఎస్‌వీ శ్రీనివాసరావు, బి.రేవతి పాల్గొన్నారు.



క్షేత్ర పర్యటనకు బయలుదేరిన గణపవరం డిగ్రీ కాలేజ సైన్సు విద్యార్థులు

దివ్యాంగులను ఆదుకోవాలి

భీమడోలు: దివ్యాంగులను ఆదుకోవడమే మాధవ సేవ అని పలువురు వక్తలు కొనియాడారు. గుండుగొలనులోని విఘ్నేశ్వర దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం గ్రామంలోని 55 మంది దివ్యాంగులకు దాతల ఆర్థిక సాయంతో నెలవారీ వితరణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన శంకర్ మాస్టార్ కుటుంబ సభ్యులు గంటి రవితేజ, లక్ష్మీశ్రావ్య దంపతులు వారికి సన్నబియ్యం, పండ్లను ఉచితంగా అందించారు. గ్రామానికి చెందిన దాత చింతలపాటి బుజ్జిరాజు దివ్యాంగులకు రగ్గులను అందించారు. నిర్వాహకులు పేరిచర్ల శ్యామలరాజు, గేదెల శ్రీనివాసరావు, ఎస్.సోములు, రావి గంగరాజు, సేవా సమితిసభ్యులు పాల్గొన్నారు.

జూనియర్ సహాయకుడి కుటుంబానికి పరామర్శ

ఉంగుటూరు: జూనియర్ సహాయకుడు దామిశెట్టి వెంకటేశ్వరరావు కుటుంబాన్ని జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ బుధవారం పరామర్శించారు. ఉండి మండలం కోలామూరు పంచాయతీలో జూనియర్ సహాయకుడిగా పనిచేస్తున్న వెంకటేశ్వరరావు గత శుక్రవారం మరణించిన సంగతి తెలిసిందే. డీపీవో శ్రీనివాస్ విశ్వనాథ్, శైలజ దంపతులు ఉంగుటూరులోని వెంకటేశ్వరరావు ఇంటికి వచ్చి అతని భార్య స్వరూపరాణిని, కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ప్రభుత్వ పరంగా వెంకటేశ్వరరావు కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని డీపీవో తెలిపారు. వెంకటేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించిన వారిలో ఆప్కో డైరెక్టర్ దొంతంశెట్టి సత్యనారాయణ, మాజీ సర్పంచి పెనుగొండ సూర్యచంద్రరావు, పంచాయతీ కార్యదర్శి గిరిధర్ తదితరులు ఉన్నారు.

మందిరాన్ని నిర్మించి తల్లిదండ్రుల విగ్రహాల ఏర్పాటు



పోలసానిపల్లిలో విగ్రహాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమడోలు: పోలసానిపల్లికి చెందిన దారముక్కల కాశీవిశ్వనాథశర్మ సేవలు చిరస్మరణీయమని పలువురు అన్నారు. పోలసానిపల్లిలో మాతృదేవోభవ పితృదేవోభవ భావనతో దారముక్కల గోపాలకృష్ణ శాస్త్రి తన తల్లిదండ్రులు కాశీవిశ్వనాథశర్మ, అనసూయ జ్ఞాపకార్థం మందిరాన్ని నిర్మించి వారి విగ్రహాలను బుధవారం ఆవిష్కరించారు. గ్రామస్తులు పలువురు గోపాల కృష్ణను అభినందించారు.

బాదంపూడి ట్రస్ట్ ద్వారా విస్తృత సేవలు

దెందులూరు: గ్రామీణ ప్రాంతాల్లో విద్య, వైద్యం, మౌలిక వసతుల కల్పన, వృద్ధుల సంక్షేమం కోసం బాదంపూడి స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బాదంపూడి రమేష్ బాబు అన్నారు. బుధవారం మేదినరావుపాలెంలో, ఏలూరులోని పాత బస్టాండ్ సూర్య రోడ్డులోని సుజాత ఇంజనీరింగ్, లూబీ మోటార్స్ కార్యాలయం వద్ద ట్రస్ట్ ఆధ్వర్యంలో మెకానిక్‌లకు టూల్ పరికరాలు, బ్యాగులు, క్యాలెండర్లు, డైరీలు అందజేశారు.